## బీఆర్ఎస్‌లోకి జోరుగా చేరికలు



ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ప్యాలాల రాములు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలం రోజురోజుకూ పెరుగుతున్నది. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్యాలాల రాములు శనివారం రాత్రి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే సురేందర్ స్థానికంగా ఉంటూ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. మాచాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్ నాయక్, దాబా నారాయణ, అరవింద్‌గౌడ్, మాచాపూర్ గ్రామ యువకులు పాల్గొన్నారు.

### రామారెడ్డిలో..

రామారెడ్డి, నవంబర్ 5: బీఆర్ఎస్ రామారెడ్డి మండల అధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన ఐదుగురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గులాబీ పార్టీలో చేరారు. వారికి రవీందర్‌గౌడ్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ పోతునూరి ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు మహిపాల్, భైరయ్య, భూషణ్, రాజేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరుతున్న రామారెడ్డి కాంగ్రెస్ నాయకులు

# ఇంటింటా ప్రచారం



నాగిరెడ్డిపేట మండలం మెల్లెకుంట తండాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తాడ్వాయిలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి/ తాడ్వాయి/ గాంధారి, నవంబర్ 5: ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా జాజాల సురేందర్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ నియోజకవర్గంలో ఆయన చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాను ప్రజలకు వివరించి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

నాగిరెడ్డిపేట మండలంలోని మెల్లెకుంట తండా పరిధిలో ఉన్న పలు తండాల్లో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సురేందర్‌ను మరోసారి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో నాయకులు గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, బిట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట మండలంలోని ఐలాపూర్, రాంపల్లి, రాపల్లి తండాల్లో బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు నరహరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి గులాబీ పార్టీ అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఎమ్మెల్యేగా సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడ్వాయిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాఘవరెడ్డి, రాము, రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు. గాంధారి మండలంలోని నేరల్, నాగ్లూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి సురేందర్‌ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధారి మండలంలో..



లింగంపేట మండలం రాంపల్లిలో..

## వాహనదారులు ఎన్నికల నిబంధనలు పాటించాలి



గాంధారిలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడ్వాయి/ గాంధారి, నవంబర్ 5: గాంధారి మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామ సమీపంలో కామారెడ్డి – ఎల్లారెడ్డి రహదారిపై ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్సై ఆంజనేయులు వాహనదారులకు సూచించారు. వాహనాల్లో డబ్బులు తీసుకెళ్లేవారు వాటికి సంబంధించిన వివరాలను వెంట ఉంచుకోవాలని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు.

గాంధారిలోని ప్రధాన రహదారిపై ఎస్సై ప్రేమ్‌దీప్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. కార్లు, ద్విచక్ర వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన వ్యక్తికి సన్మానం



పెద్దబూరి సత్యాన్ని సన్మానిస్తున్న లబాన్ సమాజ్ బాధ్యులు

గాంధారి, నవంబర్ 5: మండల కేంద్రానికి చెందిన పెద్దబూరి సత్యం 'తెలంగాణ రాష్ట్రంలో సామాజిక కార్యకర్తల ఆవశ్యకత' అనే అంశంపై పరిశోధనలు చేసి, తెలంగాణ యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ పట్టాను పొందారు. అతడికి మండలంలోని లబాన్ సమాజ్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలో శాలువా కప్పి ఘనంగా సన్మాంచారు. ఈ సందర్భంగా సమాజ్ నాయకులు మాట్లాడుతూ.. డాక్టరేట్ పొందిన సత్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిషన్ నాయక్, నర్సింగ్, పెంటయ్య, తాన్‌సింగ్, దేవీసింగ్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవుడిని దర్శించుకున్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు



కాలభైరవ స్వామి వారి ఫొటోను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

రామారెడ్డి, నవంబర్ 5: మండలంలోని ఇసన్నపల్లి – రామారెడ్డి గ్రామాల్లో వెలసిన కాలభైరవస్వామి ఆలయంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు పరాశివమూర్తి ఆదివారం దర్శించుకున్నారు. బహుళ అష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు స్వామి వారి చిత్ర పటాన్ని అందజేశారు. ఆయన వెంట లైజర్ అధికారి ప్రవీణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## స్నేహితుడి కూతురు వివాహానికి రూ.3లక్షల ఆర్థిక సహాయం



రాజుకు ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

తాడ్వాయి, నవంబర్ 5: మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామంలో ఆడ పిల్ల పెండ్లికి మిత్రుడి ఆర్థిక ఇబ్బందిని చూడలేక స్నేహితులు అందరూ కలిసి అదివారం రూ.మూడు లక్షల సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన ఆజాద్ యూత్ సంఘం సభ్యులు కలిసి తమ సంఘ సభ్యుడు మంగలి రాజు కూతురు వివాహానికి 3 లక్షల రూపాయలు ఇచ్చి స్నేహమంటే ఇదేరా అని నిరూపించారు. మంగళి రాజు పేదరికంతో బాధపడుతుండడంతో అతడి స్నేహితులు అందరూ కలిసి 2020 సంవత్సరంలో రూ.2.50 లక్షలను జమచేసి బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అతడి కూతురుకు వివాహ సంబంధం కుదరడంతో అప్పట్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన డబ్బులు రూ.మూడు లక్షలు కావడంతో అందుకు సంబంధించిన బాండ్‌ను రాజుకు అందజేశారు. సంఘ బాధ్యుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ స్నేహితుడి కూతురు పెండ్లికి సహాయం చేయడం సంతోషంగా ఉన్నదన్నారు.